
కథ

# ప్రయాణం

ఎన్. తారక రామారావు

‘‘రేపు నే పెళ్లి చేసుకుంటున్నా- నువ్వూ మీ ఆవిడ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు రావాలి- ఏం?’’ రఘురాం చెప్పిందానికి, చలపతి నిశ్చేష్టుడయ్యాడు. క్షణం నోట మాట రాలేదు. నిజమా-లేక పరిహాసమా? అన్న సందిగ్ధంలో వుండగానే, రఘురాం ‘‘చలపతీ- ఇది నిజం! రేపు కారు తీసుక వస్తా! మీ ఆవిడను ఓపిక చేసుకు రమ్మను. రిజిస్ట్రార్ ఆఫీసులో కార్యక్రమం అయ్యాక, స్వాగత్ హోటల్లో విందు- సరేనా?’’ అని చెప్పి, వచ్చినంత వేగంగా వెళ్లాడు.



చలపతి అలా, స్థాణువులాగా వుండిపోయాడు.

ఇంతలో, లోపల్నుంచి, చలపతి భార్య సరోజ, కాళ్లు ఈడ్చుకుంటూ వచ్చి, కుర్చీలో కూలబడి ఆయాసంతో ''ఎవరు వచ్చింది? పెళ్లెవరికీ?'' అనడిగింది.

''రఘురాం- రిజిష్ట్రారాఫీసులో రేపు పెళ్లిచేసుకుంటాడట- మనం వెళ్లాలి''

సరోజ క్షణం ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత తేరుకుంది.

''రఘురాంకి పెళ్లా--- అయన మాకంటే---

''ఓ సంవత్సరం పెద్ద!''

''మరిప్పుడు పెళ్ళేమిటీ?''

చలపతి దగ్గర సమాధానం లేదు.

''కొడుకులకి సంగతి తెలుసా?''

''ఏమో?''

''ఇన్నేళ్లొచ్చి- ఇప్పుడిదేం పొయ్యే కాలం?'' సరోజకు ఆయాసం వచ్చి, ఆశ్చర్యపోయి, భర్త నుంచి సమాధానం రాక, ఊరుకుంది.

చలపతి బుర్రలో- రఘురాం జీవితంలో ఘట్టాలు- గిరగిరా తిరుగుతున్నాయి.

చలపతి-రఘురాం ఇద్దరూ కల్సి చదువుకున్నారు.

చలపతి చరిత్రోపన్యాసకుడిగా జీవితంలో స్థిరపడితే, రఘురాం బ్యాంకులో చేరి, క్రమక్రమంగా ఎదిగి, పెద్దాఫీసరుగా పదవీ విరమణ చేశాడు.

ఎప్పుడు- మల్లెపువ్వులాంటి వస్త్రధారణ కళ్లకు రిమ్‌లెస్ జోడు, కొన్నాళ్లు స్కూటరు ఆ తర్వాత కారు, విశాలమైన బ్యాంకు కేటాయించిన ఇళ్ళలో నివాసం- ఇదీ రఘురాం జీవన సరళి. డబ్బుకు, సౌఖ్యాలకు పరపతికీ మారుపేరుగా రఘురాం బ్రతికితే-

చలపతి- పేరుకు కాలేజీలో లెక్చరర్ అయినా, తమ్ముళ్ళ చదువులు- చెల్లెలు పెళ్లి, తల్లిదండ్రుల పోషణ- ఆ బాధ్యతే, తర్వాత పిల్లల చదువులు- పెళ్లిళ్లు- ఇలా బాధ్యతల బరువు మోసి, వయస్సు కన్నా వృద్ధాప్యం ఛాయలతో- అసలు, సిసలు-బడి పంతులుకు ప్రతిరూపంగా నిలిచాడు.

ఉద్యోగాలు- జీవన విధానం వేరయినా పండుగలకు, పెళ్లిళ్లకు, శుభకార్యాలకు- కలవడం వల్ల రెండు కుటుంబాల మధ్య, అనుబంధం ఆత్మీయతలు గాఢంగానే వుండేవి.

''సావిత్రి- పోయి ఎన్నాళ్లయింది'' సరోజ ప్రశ్నించింది.

''రఘురాం రిటైర్‌మెంట్‌కు అటో ఇటో''

''అంటే, నాలుగేళ్లు. ఈ నాలుగేళ్లలో ఈయనకు మళ్లీ పెళ్లి కావాల్సోచ్చిందా?''

చలపతి మాట్లాడలేదు, ఎందుకంటే- అతనికీ సమాధానం తెలియదు గనుక!

మర్రోజు, వోపిక లేకపోయినా సరోజతో చలపతి, రిజిష్ట్రార్ ఆఫీసుకు వెళ్లాడు. ఇద్దరూ సాక్షి సంతకాలు చేశారు. దంపతులు, దండలు మార్చుకున్నారు.

సరోజకు పెళ్లికూతురును చూడగానే ఎక్కడో చూశానే, అన్న జ్ఞాపకపు దొంతరలు కళ్ల ముందు తిరుగాడాయి.హోటల్‌లో విందు జరుగుతున్నప్పుడు చొరవ తీసుకుని, పెళ్లికూతురు దగ్గర కెళ్లి పరిచయం చేసుకుని- ''నువ్వు---శకుంతలవి గదా?'' అనడిగింది.

శకుంతల చిరునవ్వుతోనే, 'ఔ'నన్నట్లు సమాధానం చెప్పింది.

సరోజకు, తను చదువుకున్న, స్కూల్ రోజులు గుర్తుకొచ్చాయి. శకుంతల, సరోజ, రమ, సరస్వతి- ఇలా ఆనాటి సహాధ్యాయులంతా గుర్తుకొచ్చారు.

శకుంతలను, ఆప్యాయంగా అక్కున చేర్చుకుని, ''ఎన్నాళ్లకు కలిశామే---- అవునూ-- ఈ పెళ్లేమిటే?'' అనడిగింది-

శకుంతల, ''తీరిగ్గా చెబుతా!'' అంది.

విందు భోజనాలయ్యాక అందరూ గ్రూప్ ఫొటోలు దిగారు. రఘురాం-శకుంతల మిత్రులు దాదాపు వందమంది అక్కడ కలిశాం.

సరోజకు, శకుంతల జ్ఞాపకాలు వీడలేదు.

ఆ తర్వాత, గుర్తొచ్చినప్పుడల్లా- చలపతికి, తన చిన్ననాటి స్నేహం గురించి, స్నేహితుల గురించి, చెప్పసాగింది.

''శకుంతల చాలా తెలివిగలదండీ. చదువులో మాకందరికీ లీడరు. ఆటల్లో, పాటల్లో ఫస్ట్- అయితే ఏం లాభం- వాళ్ల వాళ్లు, డిగ్రీ కాగానే పెళ్లి చేశారు. దానికేమొ ఉద్యోగం చెయ్యాలని- ఇంకా, ఇంకా చదవాలనీ ఉండేది.

''దానికి, ఈ వయస్సులో పెళ్లేమిటో'' అని కూడా ఆలోచించింది సరోజ.

రఘురాం-శకుంతల పెళ్లి తర్వాత పుణ్యక్షేత్రాలకు వెళ్లి, పదిహేను రోజుల దాకా రాకపోవడంతో- సరోజ, అసహనంగా గడిపింది. ఈ పదిహేనురోజుల్లో ఆమెకు గుండె దడ, మొకాళ్లనొప్పులు, ఆయాసం, నీరసం గుర్తురాలేదు.

''ఈ వయస్సులో ఈ ప్రేమ యాత్రలేమిటో-- పుణ్యక్షేత్రాలని వంక-అంటే'' అని తీర్మానించి, చలపతికి తీర్మానం చెప్పేసింది.

చలపతికీ, రఘురాం ఆంతర్యం- అర్థం కాలేదు. చలపతి, తన తోటి వారిని రఘురాం బంధువులనూ, ఈ విషయంలో ప్రశ్నించినా సరైనా సమాధానం లభ్యం కాలేదు.

అమెరికాలో వున్న- రఘురాం, ఇదరు కొడుకులకు, వాళ్ల ఇళ్ళాళ్లకు- ఈ వివాహం సంగతి తెలుసా? ఢిల్లీలో వున్న కూతురు-అల్లుడు ఈ పెళ్లి వ్యవహారం ఏలా ఆమోదిస్తారు.

రఘురాం- చర్య-చాలామందికి ఎన్నో ప్రశ్నలు వేసేలా చేశాయి గాని, సమాధానం ఇచ్చేవారేలేరు. ఎవరికి వారు- తోచిన విధంగా ఓ అభిప్రాయానికొచ్చారు.

''రఘురాం, డబ్బు మదంతో--- పెళ్లి చేసుకున్నాడు''

''డబ్బు చూసి చేసుకుంది. ఎప్పుడో అన్నీ సర్దుకుని ఉడాయిస్తుంది''


''సంప్రదాయ కుటుంబాల్లో-- ఈ ఆప్రాచ్యపు పనులేమిటి?

''అబ్బే- మన సంగతి, సంప్రదాయం మట్టిలో కలిశాయి. విదేశీ నాగరికత యింత విశృంఖలంగా ప్రవేశించడం--- యింకా ముందు, ముందు ఏం అనాచారాలు చూడాలో''

రఘురాం- శకుంతల ఎలా సంసారం చేస్తున్నారు. ఎలా బ్రతుకుతున్నారు. అందరికీ అనుమానాలే. ఎవ్వరూ తెగించి-రఘురాంని అడగలేదు.

కానీ సరోజ వీలు చేసుకుని, వోపికతెచ్చుకుని, శకుంతలను కల్సింది. ఆమాటా-ఈమాటా మాట్లాడుతూ- శకుంతల జీవితాన్ని గురించి తెల్సుకుంది.

''పాపం-శకుంతల చాలా కష్టాలు పడ్డదండి. పెళ్లయిన నాలుగేళ్లకే, మొగుడు పోయ్యాడట- పాపం, ఉన్న ఆడపిల్లను, తను స్కూల్లో చేరి, సాకి చదువు చెప్పింది, పెళ్లి చేసింది'' అది జీవితంలో కష్టాలేతప్ప, సుఖం ఎరుగదు- అందుకే--- అని



చలపతికి చెప్పింది-

''కూతురు దగ్గరుండొచ్చుగా!''

''వెళ్లొచ్చు- అల్లుడు వైమానికదళంలో ఇంజనీరు- ఓ ఊరు కాదు- ప్రతినాలుగేళ్లకూ ఊళ్లు మారతారుట- అయినా, ఇదెళ్లి ఏం చేస్తుంది. అందుకే---''

సరోజకు, శకుంతలంటే, సానుభూతి ఏర్పడ్డది.- తరచుగా వెళ్లి- శకుంతలను కల్సి, కాలక్షేపంగా, కబుర్లు మోసుకొచ్చేది-

''శకుంతల మంచి పని చేసిందండి- ఎన్నాళ్లో ఒంటరి జీవితం గడిపింది గదా- ఇప్పుడు, రఘురాం- శకుంతల-చిలకా గోరింకల్లా వున్నారండి- పైగా యింకో విషయం తెలుసా- రఘురాం ఇప్పుడు క్లబ్బుకెళ్లి, పేకాడటం, మందు తాగడం మానేశాడట!''

''అంతగా ఆవిడ వలలో చిక్కుకున్నాడన్న మాట!''

చలపతిమాటలకు, సరోజ అవాక్కయింది. తమాయించుకుంది

''ఆయనకు అరవై పైన, దీనికి యాభై పైన- అది వల వేయడం, ఈయన అందులో చిక్కడమేమిటీ--మీకంత కుళ్లు, ఈర్ష్య పనికిరాదు-''

''ఎంతయినా-రఘురాం అదృష్టవంతుడు-''

''మీకు మటుకు- ఏం తక్కువ?''

చలపతి మాట్లాడలేదు, పెళ్లాం అనారోగ్యం, గుర్తుకొచ్చి- తను దురదృష్టవంతుడే అని చలపతి పూర్తి నమ్మకం. పెళ్లాం కొన్నాళ్లు పురుళ్లు- ఆ తర్వాత ఈతిబాధలు- పిల్లల పెంపకం---- ఇలా గత చరిత్ర- స్వర యుగం- సుఖ ప్రదమేమీ కాదు. చలపతి ఎడారిలో అలసిపోయిన మనిషి.

ఓ రోజు, శకుంతల ఫోన్ చేస్తే- సరోజ ఉరుకులు, పరుగుల మీద వెళ్లింది- ఏదో ఉపద్రవం జరిగిందోనని.

''ఇది నా కూతురే- వీళ్లిద్దరూ మనవలు- అదిగో అక్కడ రఘురాంతో, కూర్చొని కబుర్లు చెబుతున్నాడే- ఆయన అల్లుడు. అకస్మాత్తుగా వచ్చారు. మళ్లీ సాయంత్రం వెళుతున్నారు- మీకు పరిచయం చేద్దామని!'' శకుంతల పరిచయం చేసింది.

''ఆంటీ- మా అమ్మ ఇన్నాళ్లకోమంచి పని చేసింది!'' అని శకుంతల కూతురు అంటే సరోజ ఆనందించింది.

''అవును. నీ లాంటి కూతురుండగా దానికేం లోపం!'' అంది సరోజ.

ఇంటికొచ్చి, ''ఏమండీ. మా శకుంతల, అదృష్టవంతురాలండి. దాని కూతురు అల్లుడు రఘురాంని స్వంత తండ్రిలా, మామగా ఎంతో అభిమానిస్తున్నారో- వీలుచేసుకుని, డార్జిలింగ్ రావాలని ఆహ్వానించారు'' అని సరోజ చెబితే చలపతి మరీ దిగాలుపడ్డాడు- రఘురాం అదృష్టానికి.

చలపతి తన కొడుకులు గుర్తొచ్చారు. ప్రతివాడి దగ్గర నాలుగు నెలలు మకాం. అంతే-తల్లికి జబ్బు చేస్తే- చుట్టపుచూపుగా రావడం పోవడం. అంతే- ఇక కూతురు వచ్చినప్పుడల్లా కోరికలు విప్పి చదవడం-

చలపతికి అసహనం- ఈర్ష్య- అశక్తత అన్నీ వచ్చాయి. వివరంగా-రఘురాం, కొడుకులకు ఉత్తరం రాశాడు- ఏమాత్రం అశ్రద్ధ చేసినా- అవి పరాధీనం అవుతుందని అకాశ రామన్న పేరు మీద. అప్పటికి చలపతి మనస్సు కుదుటపడింది.

రఘురాం-శకుంతల డార్జిలింగ్ వెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ కూతురు దగ్గరకు వెళ్ళొచ్చారు.

రోజులు చలపతికి, భారంగా, రఘురాంకు ఆనందంగా నడుస్తున్నాయి...

సంక్రాంతికి, రఘురాం కొడుకులు-కోడళ్లు-మనవలు అమెరికా నుంచి వచ్చారు

రఘురాం కూతురు-అల్లుడు ఢిల్లీ నుంచి-శకుంతల కూతురు అల్లుడు డార్జిలింగ్ నుంచి వచ్చారు.

రఘురాం ఇల్లంతా సందడే సందడి విందులు-వినోదాలు-అంతా పండుగ వాతావరణం రఘురాం పిలిస్తే చలపతి-సరోజ ఓ రోజు వెళ్లారు పగలంతా ఉన్నారు. ఆ వాతావరణం-అందరి మధ్య గల ఆప్యాయతలు-పలకరింపులు-చూశాక చలపతికి అనుమానం వచ్చింది. ఇది కలా నిజమా అని! కలైతే బాగుండు-అనుకున్నాడు.

అనుమానం నివృత్తి చేస్తూ-రఘురాం పెద్ద కొడుకు చెప్పాడు-

''అంకుల్- మా అమ్మపోయాక పెద్ద దిక్కు లేని వాళ్లమయ్యాం. నాన్న మా దగ్గరికొచ్చినా ఏకాకీ బతుకే.

నాన్న-శకుంతల పెళ్లిచేసుకుని మాకు, ఇక్కడో ఇల్లుంది- అమ్మ నాన్న ఉన్నారని ధైర్యం ఇచ్చారు. మా పిల్లలకు తాతయ్య బామ్మ, ఉన్నారన్న ఆనందం ఇచ్చారు- ఇక నుంచీ- అందరం- సెలవులకు వచ్చి- ఇక్కడ కొన్నాళ్లు గడుపుతాం

మరో విషయం అంకుల్- మానాన్న ఒంటరితనం గురించి మాకు బాధ లేదు. మా అమ్మ వుందిగా-

వాళ్ల ప్రయాణం సుఖంగా- ప్రశాంతంగా సాగాలి''


రఘురాం-శకుంతల-వాళ్లపిల్లలు- మనవలు మనుమరాండ్రు కేరింతలు-చప్పట్లుకొట్టారు.

చలపతికి చరిత్ర తెలుసు కాని, వర్తమానం తెలియదు- సరోజ ఒంటరి జీవిత ప్రయాణంలో తోడు-నీడ దొరికిన-శకుంతలను మనసులోనే అభినందించింది.


ఆ రాత్రి,

సరోజ-చలపతి గుండెల్లో తల దాచుకుంది చలపతి-సరోజను ఆప్యాయంగా గుండెలకద్దుకుని, మృదువుగా బుగ్గలపై, ఓ ముద్దు ఇచ్చాడు. ఆ తర్వాత- వారి జీవితం సుఖంగా- ప్రశాంతంగా సాగుతునే వున్నది.

*



# షారుక్ తెలివి



ఇప్పటి వరకూ బాలీవుడ్‌లో బలమైన రెండు వైరి వర్గాల నాయకులుగా అంతా అభివర్ణించిన షారుక్ ఖాన్, అక్షయ్ కుమార్‌లు ఇద్దరూ కలిసి నటించబోతున్నారట. అక్షయ్ కుమార్ ఇటీవల కొన్ని నెలలుగా వరుస హిట్లతో షారుక్ నంబర్‌వన్ స్థానానికి పోటీదారుగా తయారయ్యాడు. ఇద్దరి సినిమా వసూళ్ళనూ పోల్చి అందరూ షారుక్ కన్నా అక్షయ్ కుమారే బాలీవుడ్ నంబర్ వన్ స్థానానికి అర్హుడని తేల్చిచెప్పారు. దీంతో షారుక్‌కి భయం పట్టుకుందనుకుంటా. ఇటీవల ఇద్దరూ ఓ ప్రముఖుని పుట్టిన రోజు పార్టీకి హాజరయ్యారు. అక్కడ షారుక్ పనిగట్టుకుని మరీ అక్షయ్ దగ్గరకు వెళ్ళి మాట్లాడటం ప్రారంభించాడు. ఇద్దరూ సుమారు ఓ గంట సేపు మాట్లాడుకున్నారట. ఈ సంభాషణలో ఎక్కువ శాతం మాట్లాడింది షారుకే. అక్షయ్ కేవలం విన్నాడట. ఈ సంభాషణ తర్వాత ఇప్పుడు వినవస్తున్న వార్త ఏమిటంటే, షారుక్ నిర్మించబోతున్న ఓ చిత్రంలో అతనితో కలిసి అక్షయ్ నటించబోతున్నాడట. ఇందులో ఇద్దరూ పోలీసులుగా నటిస్తున్నారట. మొత్తానికి షారుక్ నటనలోనే కాదు, వ్యవహారశీలతలోనూ బాద్షానే అన్నమాట!